# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ విజయానికి ప్రేరణ కన్నా క్రమశిక్షణ ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులకు స్పష్టం చేశారు.

❖ ప్రభుత్వ నిర్ణయాలను అధికారులు సమర్ధవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

❖ అధికారులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

❖ శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి.

=====================

పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళనను ఎలా అధిగమించాలనే విషయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ "పరీక్షా పే చర్చ" 9వ ఎడిషన్ లో భాగంగా ఈరోజు విడుదలైన రెండవ ఎపిసోడ్‌లో విద్యార్థులతో పంచుకున్నారు. సాంప్రదాయ భోజనం, సమతుల్య ఆహార అలవాట్ల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించారు. విజయానికి క్రమశిక్షణా ? ప్రేరణా ? ఏది ముఖ్యమని ఒక విద్యార్థిని అడిగిన ప్రశ్నకు ప్రధానమంత్రి బదులిస్తూ... ఆ రెండూ జీవితంలో అవసరమని చెప్పారు. క్రమశిక్షణ లేకుండా కేవలం ప్రేరణ ఉన్నంత మాత్రాన ప్రయోజనం ఉండదని వివరిస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

=====================

ప్రభుత్వ నిర్ణయాలను అధికారులు సమర్ధవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. జిల్లా స్థాయిలో చేపట్టిన పనులను ఇన్‌చార్జ్ మంత్రులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. జీఎస్‌డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, ఆదాయార్జన శాఖలు, పెట్టుబడులు, పీపీపీ ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్ర

సచివాలయంలో మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులతో ఆయన ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. అమరావతి కేంద్రంగా రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్లు తయారవుతాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, డేటా సెంటర్లతో పెను మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత 19 నెలల నుంచి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, వాటన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో అందాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే అవగాహనా కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. 2026 ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల గోడ పత్రికను భీమవరంలో కలెక్టర్ ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు తమ ఆర్థిక వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించుకునేలా అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పొదుపు అలవాట్లు, బ్యాంకింగ్ సేవల వినియోగం, డిజిటల్ లావాదేవీలు, రుణాల నిర్వహణ, బీమా పెట్టుబడులపై ప్రజలకు స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవడం ద్వారా ఆర్థిక స్వావలంబనను సాధించగలరని కలెక్టర్ తెలిపారు.

=====================

భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యన్నారాయణ రావు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో ఆయన ఈరోజు పాల్గొని జిల్లాలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వాటి గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పి.జి.ఆర్.ఎస్.కు వచ్చే సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఆదేశించారు.

విరామం

=====================

అధికారులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన వివిధ శాఖల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ… ప్రభుత్వ విధానాలను అమలు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. పల్లె పండుగకు 2 వేల 500 కోట్లు, అడవితల్లి బాటకు 1,005 కోట్ల రూపాయలు మంజూరు చేశామని వెల్లడించారు. వివిధ పథకాలకు 11 వేల 328 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని, జల్ జీవన్ మిషన్‌కు 25 వేల కోట్ల రూపాయలు మొబిలైజేషన్ చేశామన్నారు. ఇప్పటికే దాదాపు 10 వేల కోట్ల రూపాయల పనులు ప్రారంభమయ్యాయని తెలియజేశారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరించొద్దని, క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు ఎవరికి వారు సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాల్సిందేనని పవన్ కళ్యాణ్ స్పష్టం చేస్తూ…

(వాయిస్ 20 సెకన్లు)

=====================

తిరుపతి జిల్లాలోని ప్రముఖ వాయులింగక్షేత్రం శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఈఓ బాపిరెడ్డి తెలిపారు. రేపు సాయంత్రం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ఈనెల 23వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు.

ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఒక్కో వాహనంపై స్వామి, అమ్మవార్లు ఊరేగుతూ.. భక్తులకు దర్శనమివ్వనున్నారని.. ఈ నెల 15వ తేదీ మహాశివరాత్రి ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఈఓ బాపిరెడ్డి వెల్లడించారు.

====================

సముద్ర తీర ప్రాంతాలలో దేశభద్రతపై అవగాహన కల్పించేందుకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వందేమాతరం సైక్లోథాన్-2026" కొద్దిసేపటి క్రితం బాపట్ల జిల్లా రామాపురం తీరప్రాంతానికి చేరుకుంది. ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నం నుండి ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర బాపట్ల జిల్లాలో కొనసాగుతోంది. రేపు ఉదయం రామాపురం నుంచి కావలికి బయలుదేరుతుంది. జాతీయా గేయం వందేమాతరం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ సైకిల్ యాత్ర మొత్తం 9 రాష్ట్రాల మీదుగా 6 వేల 500 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ... ఈ నెల 22న కేరళలోని కొచ్చి తీరానికి చేరుకోవడంతో ముగుస్తుంది.

====================

వెట్టి చాకిరి కార్మిక వ్యవస్థ రద్దు చట్టం అమలులోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఈరోజు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ పాడేరు పాత బస్ స్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వెట్టి చాకిరి నిర్మూలనపై నినాదాలు చేస్తూ.. ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ డైరెక్టర్ కిళ్లు వెంకట రమేష్ నాయుడు మాట్లాడుతూ... వెట్టి చాకిరిని నిర్మూలించడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

====================

రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం అండలూరు నుంచి పాలకోడేరు మండలం కొండేపూడి వరకు 2 కోట్ల రూపాయల వ్యయంతో ఆర్ అండ్ బి రోడ్డు పనులకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూ పాలన అందిస్తున్నామని చెప్పారు. అనంతరం అండలూరు గ్రామంలో 20 లక్షల రూపాయల ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను భీమవరం శాసన సభ్యులు పులపర్తి రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు.

====================

రాష్ట్రంలో నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ తెలిపారు. ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉచిత శిక్షణకు సంబంధించిన వివరాలను మంత్రి ఫరూక్ వెల్లడించారు.

====================
====================